

చిగురుకోట విఆర్‌ఒకు స్థానచలనం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ముదినేపల్లి :కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలతో మండలంలోని చిగురుకోట విఆర్‌ఒకు స్థాన చలనం కలిగింది. ఒక గ్రామానికి చెందిన విఆర్‌ఒ, మరో గ్రామ విఆర్‌ఎ కుమ్మక్కై డిపెండబుల్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు డబ్బులు ఇవ్వాలని మండలం లోని వడాలికి చెందిన ఆరేపల్లి శ్రీనివాసరావును డిమాండ్ చేశారు. దీనిపై ఈ నెల మూడో తేదీన డిపెండబుల్ సర్టిఫికెట్ ఇచ్చేందుకు దందా అనే శీర్షికన ప్రజాశక్తిలో వార్త ప్రచురితమైంది. దీనిపై కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చిగురుకోట విఆర్‌ఒను మండలంలోని కోడూరు గ్రామానికి బదిలీ చేస్తూ తహశీల్దార్ లతీఫ్ పాషా ఉత్తర్వులు జారీ చేశారు. గురజ విఆర్‌ఒ కె.కిషోర్‌ను చిగురుకోట విఆర్‌ఒగా బదిలీ చేశారు. కోడూరు విఆర్‌ఒ కరీంను గురజ విఆర్‌ఒగా బదిలీ చేశారు. తహశీల్దార్ ఆదేశాలతో కిషోర్ చిగురుకోట విఆర్‌ఒగా ఇప్పటికే బాధ్యతలు చేపట్టగా గురజ విఆర్‌ఒగా కరీం, కోడూరు విఆర్‌ఒగా ఏసుబాబు సోమవారం బాధ్యతలు చేపట్టనున్నారు.

అక్రమ చేపల చెరువుపై..

చర్యలు తీసుకునేనా..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ప్రభుత్వ భూమి ఆక్రమించుకుని చేపల చెరువు తవ్వుకున్నాం. పదేళ్లుగా దర్జాగా అనుభవిస్తున్నాం. చెరువులో లేని వ్యక్తి పేరున విద్యుత్ మీటర్‌తో సబ్సిడీ పొందుతున్నాం.. అయితే మమ్మల్నే ప్రశ్నిస్తారా.. మాకు రాజకీయ అండ ఉంది. ప్రశ్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి' అంటూ అధికారులకే వినతులు ఇస్తున్న అందరినీ విస్మయపరుస్తోంది. నిడమర్రు మండలం అడవికొలను గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమించుకుని చేపల చెరువు తవ్వుకున్న వ్యక్తులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశమవుతోంది. అడవికొలనులోని తిమ్మారావుగూడెం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 148 నుంచి 163 సర్వే నెంబర్లలో దాదాపు 70 ఎకరాల చేపల చెరువు ఉంది. ఈ చేపల చెరువులో సర్వే నెంబర్ 159-4 సర్వే నెంబర్‌లో పంట బోదెకు చెందిన 94 సెంట్ల భూమి ఉంది. ప్రభుత్వ భూమిని ఆక్రమించి దర్జాగా చేపల చెరువు తవ్వేశారు. అప్పటి జిల్లా కలెక్టర్ కాటంనేని భాస్కర్ ఈ చెరువుపై ఫిర్యాదులు రావడంతో నిలుపుదల చేశారు. దాదాపు రెండేళ్లకుపైగా ఆ చెరువు తవ్వకం నిలిచిపోయింది. తర్వాత వివిధ రకాల ఎత్తుగడలతో చేపల చెరువు తవ్వేశారు. చెరువులోని ప్రభుత్వ భూమికి ఏడాదికి ఎకరాకు రూ.లక్ష వరకూ లీజు వస్తోంది. అంటే ప్రభుత్వ భూమి 94 సెంట్లు ఆక్రమించి పదేళ్లలో దాదాపు రూ.పది లక్షలు సొమ్ము ఆర్జించారు. ఇంతటితో ఆగలేదు. 70 ఎకరాల చేపల చెరువుకు పక్కనే ఉన్న పలువురు చిన్నకారు రైతులు తవ్వుకున్న ఆరెకరాల చేపల చెరువును తమ చెరువులో కలిపేసుకునేందుకు కుట్రలు పన్నారు. తప్పుడు ఫిర్యాదులు చేసి సాగు చేయకుండా చేశారు. సంబంధిత రైతులు ప్రశ్నించడంతో 70 ఎకరాల చేపల చెరువులోని కబ్జా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో మండల రెవెన్యూ అధికారులు తమకు అందిన ఫిర్యాదులను పరిశీలించి చేపల చెరువులో ప్రభుత్వ భూమి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు భూమికి సంబంధించిన హద్దులను సైతం నిర్ణయించారు. ప్రభుత్వ భూమి ఆక్రమించుకుని చేపల చెరువు సాగు చేసుకుంటున్నామని చెరువుకు సంబంధించిన వారే అధికారులు ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం (పిజిఆర్ఎస్)లో రాతపూర్వకంగా అంగీకరించి ఇచ్చారు. అంతేకాకుండా చెరువులో లేని వ్యక్తి పేరున కరెంటు కనెక్షన్ కొనసాగిస్తూ ప్రభుత్వ సబ్సిడీ సైతం అనుభవిస్తున్నట్లు వారే అధికారులకు రాతపూర్వకంగా ఇచ్చిన పరిస్థితి ఉంది. తాము ప్రభుత్వ భూమి ఆక్రమించి చేపల చెరువు తవ్వకం సాగించామని, విద్యుత్ కనెక్షన్ కొనసాగిస్తున్నామని వారే ఒప్పుకున్న పరిస్థితి. దీనిపై మరిన్ని ఫిర్యాదులు అధికారులకు వెళ్లడంతో ప్రభుత్వ భూమి ఆక్రమించి తవ్విన చేపల చెరువుకు అధికారులు నోటీసులు జారీ చేశారు. రాష్ట్రస్థాయి మత్స్యశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారుల నుంచి రెండు, మండల కమిటీ నుంచి ఒకటి, జిల్లా కమిటీ నుంచి రెండు నోటీసులు ఇప్పటికే జారీ చేశారు. చేపలు పట్టుకునేందుకు జులై 30 వరకూ గడువు ఇవ్వాలని అక్రమ చేపల చెరువుకు సంబంధించిన వారు కోరడంతో అధికారులు అవకాశం ఇచ్చారు. గడువు ముగియడంతోపాటు చేపలు పట్టుకున్నారు. ఇప్పుడు అధికారులు రంగంలోకి దిగి తామే ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్నామన్న చేపల చెరువును ధ్వంసం చేసేందుకు వెంటనే చర్యలు తీసుకుంటారో, లేదో చూడాల్సి ఉంది. మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులు చట్టప్రకారం ముందుకు సాగుతారా.. చట్టవిరుద్ధంగా నడిచి అధికార దుర్వినియోగానికి పాల్పడతారో వేచిచూడాలి.



చేపల చెరువులో ఆక్రమించుకున్న ప్రభుత్వ పంట బోదెకు హద్దులు నిర్ధారిస్తున్న అధికారులు

అక్రమాలకు కొమ్ముకాస్తున్న రాజకీయ నేతలు

ప్రభుత్వ భూమి కబ్జా చేసి చేపల చెరువు తవ్వారని గ్రామంలో అందరికీ తెలుసు. అక్రమ పద్ధతిలో విద్యుత్ కనెక్షన్ కొనసాగుతుందని తెలిసినప్పటికీ రాజకీయ నాయకులు అక్రమాలకు కొమ్ముకాస్తున్నారు. అక్రమమార్గంలో అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఏడాదిగా చేపల సాగు నిలిచిపోయిన రైతుల గురించి ఏమాత్రం ఆలోచించకుండా అక్రమంగా ముందుకు సాగుతున్నవారికి రాజకీయ నాయకులు అండగా నిలవడం చూసి అధికారులు, జనం సైతం విస్తుపోతున్నారు. చట్టం.. న్యాయం వంటి వాటికి తిలోదకాలు ఇచ్చేసి, తమవారు ఏం చేసినా కొమ్ముకాస్తాం అనే రీతిలో రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

నిడమర్రు మండలం అడవికొలనులో కబ్జా పర్వం

ప్రభుత్వ భూమి 94 సెంట్లు ఆక్రమించి దర్జాగా చేపల సాగు

పదేళ్లలో దాదాపు రూ.పది లక్షల సొమ్ము హాంఫట్

తామే ప్రభుత్వ భూమి ఆ క్రమించుకున్నామని బహిరంగంగానే వ్యాఖ్యలు

చెరువులో లేని వ్యక్తి పేరుతో కరెంటు కనెక్షన్.. ప్రభుత్వ సబ్సిడీ స్వాహా

అక్రమార్కులకు కొమ్ముకాస్తున్న రాజకీయ నేతలు

ఆక్రమిత ప్రభుత్వ భూమికి హద్దులు గుర్తింపు.. మరి చర్యలెప్పుడో

ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటారా?

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ, ప్రయివేటు భూములు ఆక్రమించుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ల్యాండ్ గ్రాబింగ్ ప్రొహిబిషన్ యాక్ట్-2024ను తీసుకొచ్చింది. ప్రభుత్వ, ప్రయివేటు భూములు ఆక్రమించినవారిపై ఫిర్యాదు అందితే అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాల్సి ఉంది. భూములు ఆక్రమించుకున్నట్లు నిర్ధారణ అయితే ఈ చట్ట ప్రకారం పదేళ్ల వరకూ జైలు శిక్ష పడే అవకాశం ఉంది. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని చేపల చెరువు తవ్వినట్లు చెరువుకు సంబంధించిన వారే రాతపూర్వకంగా ఒప్పుకున్న నేపథ్యంలో ల్యాండ్ గ్రాబింగ్ చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఇప్పటికే అధికారులకు ఫిర్యాదులు సైతం అందాయి. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తెచ్చిన ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని అధికారులు అమలు చేస్తారో లేదో కూడా చూడాలి.

13న క్విట్ కార్పొరేట్స్

నిరసనలు జయప్రదం చేయాలని ఎస్‌కెఎం, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేసుకుంటున్న విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో దేశ వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందని రైతుసంఘాలు, కార్మిక సంఘాల నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 13న సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు క్విట్ కార్పొరేట్స్ నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతుసంఘాల సమన్వయ జిల్లా కమిటీ, కార్మిక సంఘాల జిల్లా సమన్వయ కమిటీ సంయుక్త సమావేశం నిర్వహించారు. ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే, జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడారు. ట్రంప్, మోడీ స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను వ్యతిరేకిస్తూ రైతాంగం, కార్మికులు పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేయాలని కోరారు. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల భారత వ్యవసాయ రంగానికి తీవ్ర ప్రమాదం ఏర్పడిందన్నారు. ఈ ఒప్పందాల వల్ల కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూరతాయన్నారు. 10 సంవత్సరాల నాటి ట్రాక్టర్లను రద్దు చేయాలని, వాటి స్థానంలో కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేయాలని రైతులను ఆదేశించే విధానాలు దుర్మార్గమని విమర్శించారు. వాణిజ్య ఒప్పందాలు వ్యవసాయానికి, రైతులకు వినాశకరంగా ఉండకూడదని హితవు పలికారు. వ్యవసాయన్ని నాశనం చేసి భూములను కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలు తగవన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల వల్ల ఆక్వా, వ్యవసాయ రంగం తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రంప్ సుంకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని పంటలకు మద్దతు ధరలు కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని కోరారు. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణాలు రద్దు చేయాలని కోరారు. క్విట్ కార్పొరేట్ నిరసన కార్యక్రమం ఏలూరులో ఈ నెల 13వ తేదీ ఉదయం 10 గంటలకు పాత బస్టాండ్ సెంటర్లో జరుగుతుందని, జిల్లాలో మిగిలిన అనేక ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు జరుగుతాయని నాయకులు ప్రకటించారు.


అభివాదం చేస్తున్న నేతలు

పామాయిల్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఎపి వ్యకాస జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు

పామాయిల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక అన్నే వెంకటేశ్వరరావు భవనంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో సుమారు పది వేల మంది పామాయిల్ గెలలు, మట్టలు కోసే కార్మికులు ఉన్నారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. వీరితోపాటు లోడింగ్, అన్‌లోడింగ్ చేసే కార్మికులు మరో రెండు వేల మందిపైగా ఉంటారని తెలిపారు. వీరందరినీ రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక శాఖ కార్మికులుగా గుర్తించాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లాలో టి.నర్సాపురం, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి తదితర మండలాల్లో పామాయిల్ కార్మికులు గెలలు కోస్తూ విద్యుత్ షాక్‌కు గురై తోటల్లో విషపు పాములు, పురుగులు కాటేయడంతో చాలామంది కార్మికులు చనిపోవడం, వికలాంగులుగా మారడం జరుగుతుందన్నారు. ఇలాంటి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన, కార్మిక శాఖాధికారులు కనీసం పట్టించుకోకపోవడం, కార్మికుల పట్ల దుర్మార్గంగా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. పామాయిల్ గెలలు నరికే కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతోపాటు ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యాల ద్వారా గ్రూప్ ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ప్రమాదాలు జరిగినప్పుడు కనీసం ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడం, నష్టపరిహారం ఇవ్వకపోవడం దుర్మార్గమన్నారు. ఈ మధ్యకాలంలోనే ఏలూరు జిల్లాలో సుమారు పది మంది పామాయిల్ కార్మికులు విద్యుత్ షాక్‌కు గురై చనిపోయారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పామాయిల్ కార్మికులను కార్మికులుగా గుర్తించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరిగినప్పుడు వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలకు గురైన కార్మికులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు తామా ముత్యాలమ్మ, ఎస్.మహంకాళిరావు, వై.నాగేంద్రరావు, జి.వెంకట్రావు, కారం నాగదుర్గ, సాయికృష్ణ, ప్రభాకర్, సీత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ

రైల్వేగేటు మూసివేత.. ప్రయాణికుల అవస్థలు..!

బస్సుల కోసం జనం పాట్లు - అదనపు ఛార్జీలతో బెంబేలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

పామర్రు - కత్తిపూడి జాతీయ రహదారిలో ముదినేపల్లి- గుడివాడ మధ్య మల్లాయపాలెం వద్ద రైల్వే గేటు మూసివేతతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రైల్వే ట్రాక్ మరమ్మతుల దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే అధికారులు రెండు రోజులు కితం ఈ మార్గంలో రైల్వే గేటుమూసి వేశారు. దీంతో పోలీసులు చెక్ పోస్ట్ ఏర్పాటు చేసి వాహనాలు దారి మళ్లింపు చర్యలు చేపట్టారు. భీమవరం నుంచి గుడివాడ మీదుగా విజయవాడ వెళ్లే లారీలు, భారీ వాహనాలను సింగరాయపాలెం, వడ్లమన్నాడు, గుడ్లవల్లేరు మీదుగా విజయవాడ తరలిస్తున్నారు. అదే విధంగా ఆర్‌టిసి బస్సులు, ఇతర వాహనాలను ముదినేపల్లి నుంచి విన్నకోట, గుడ్లవల్లేరు మీదుగా గుడివాడకు దారి మళ్లింపు చర్యలు చేపట్టారు. దీంతో ప్రయాణికులకు దూరంతో పాటు అదనంగా ఛార్జీలు చెల్లించాల్సి వస్తోంది. ముదినేపల్లి నుంచి గతంలో గుడివాడకు 20 రూపాయలు బస్సు ఛార్జీ కాగా ప్రస్తుతం అది 35 రూపాయలు అయ్యింది. ఇక ఆటోలు విషయానికొస్తే ముదినేపల్లి నుంచి గుడివాడ వెళ్లేందుకు గతంలో ఒక వ్యక్తికి 30 రూపాయలు ఛార్జి కాగా ప్రస్తుతం ఆటోవాలాలు 50 రూపాయల వరకూ వసూలు చేస్తున్నారు. ఆటోలు ముదినేపల్లి నుంచి మోటూరు మీదుగా దొండపాడు, గుడివాడ మళ్లిస్తున్నారు. మరికొన్ని ఆటోలు పెదపాలపర్రు హైస్కూల్ వద్ద నుంచి నూతన హైవేలో సిద్ధాంతం మీదుగా బొమ్ములూరు వద్ద పామర్రు హైవే మీదుగా గుడివాడ వెళుతున్నాయి. దీంతో అదనంగా 20 కిలోమీటర్లు రానుపోను దూరం కావడంతో 50 రూపాయలు ఛార్జీ వసూలు చేస్తున్నట్లు ఆటోవాలాలు చెబుతున్నారు. గతంలో ముదినేపల్లి నుంచి విజయవాడకు ఎక్స్‌ప్రెస్ ఛార్జి 105 రూపాయలు కాగా ప్రస్తుతం అది బస్సు కేటగిరీని బట్టి 140 రూపాయల వరకూ వసూలు చేస్తున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. దీనికి తోడు బస్సులు గుడ్లవల్లేరు మీదుగా 12 కిలోమీటర్లు దూరం అదనంగా తిరిగి రావడంతో బస్సులు ఆలస్యంగా నడుస్తున్నట్లు ప్రయాణికులు చెబుతున్నారు. ఇంతకుముందు ఆర్‌టిసి బస్సులు ముదినేపల్లి బస్‌స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణాలు సాగిస్తుండేవి. బస్టాండ్ ప్రాంతంలో డ్రెయినేజీ నిర్మాణ పనులు రోడ్డుకు ఇరువైపులా జరుగుతున్నాయి. దీంతో నెల రోజులుగా బస్సులు బస్ స్టేషన్‌లోకి రావడం లేదు. బయట రోడ్డుపైనే నిలిపి వేసి ప్రయాణికులను డ్రైవర్ ఎక్కించుకుంటున్నారు. రైల్వేగేటు మూసివేత కారణంగా బస్సులు బస్‌స్టేషన్ వద్ద మలుపు తిరిగే అవకాశం లేకపోవడంతో బస్టాండ్‌కు రావడం లేదు. గుడివాడ, విజయవాడ, కైకలూరు, బంటుపల్లి వైపు వెళ్లే బస్సులు గురజ రోడ్డు సెంటర్ నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే కైకలూరు, వైపు వెళ్లే బస్సులు కూడా వైజంక్షన్ నుంచి కైకలూరు వెళ్తున్నాయి. దీంతో బస్టాండ్ వైపు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

దీంతో బస్‌స్టేషన్ ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది. బస్టాండ్ ప్రాంతంలో జనం లేకపోవడంతో వ్యాపారులు బేరాలు లేక ఉసూరు మంటున్నారు. ఇదిలా ఉండగా కొంతమంది ప్రయాణికులకు బస్సులు దారి మళ్లింపు విషయం తెలియక అయోమయానికి గురవుతున్నారు. బస్సుల కోసం బస్టాండ్ వద్ద గంటల కొద్దీ వేచి చూస్తున్నారు. తీరా విషయం తెలుసుకొని గురజ సెంటర్ వరకూ నడిచి వెళ్లి అక్కడ నుంచి బస్సులు ఎక్కి ప్రయాణం కొనసాగిస్తున్నారు. దీనికి తోడు బస్సులతోపాటు వాహనాలన్నీ ఈ రోడ్డు నుంచి రాకపోకలు సాగిస్తుండడంతో గురజ సెంటర్ రద్దీగా మారింది. బస్ డ్రైవర్లు బస్సులను ఇష్టా రాజ్యంగా ఎక్కడపడితే అక్కడ సెంటర్‌కు దూరంగా బస్సులు నిలుపుదల చేస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా భీమవరం డిపో ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు బస్సులను ఇష్టారాజ్యంగా నడుపుతూ నిర్ణీత ప్రదేశంలో ఆపడం లేదు. వారికి ఇష్టమైన చోట రోడ్ మధ్యలో బస్సులు నిలుపుదల చేయడంతో ప్రయాణికులు బస్సులు ఎక్కేందుకు పరుగులు తీస్తున్నారు. మహిళలు, వృద్ధులు బస్సుల వెనకాల పరుగులు తీస్తూ మరింత ఇబ్బంది పడుతున్నారు. భీమవరం ఆర్‌టిసి డిపో ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారంటూ వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 22వ తేదీ వరకూ రైల్వేట్రాక్ మరమ్మతులు జరుగుతున్నందున వాహనాలన్నీ గురజ రోడ్డు సెంటర్ నుంచి రాకపోకలు సాగించాల్సి ఉంది. ఆర్‌టిసి అధికారులు వెంటనే స్పందించి ఇక్కడ కంట్రోలర్‌ను ఏర్పాటు చేసి బస్సులన్నీ సెంటర్లో నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని, పోలీసులు కూడా సెంటర్లో ట్రాఫిక్ రద్దీ లేకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.



గురజ రోడ్డు సెంటర్లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

నగరంలో 6 వేల టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు వెంటనే అందించాలని సిపిఎం నగర కార్యదర్శి పంపన రవి కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదేళ్లుగా టిడ్కో ఇళ్లు ప్రజలకు అందించడానికి సమయం సరిపోవడం లేదని విమర్శించారు. టిడిపి హయాంలో రూపొందిన టిడ్కో ఇళ్ల పరిస్థితి ఇలా ఉంటే వైసిపి అధికారంలో ఉండగా లక్ష్మీపురం, కొమడవోలు, పోణంగిలో 20 వేల మందికి ప్రభుత్వ కాలనీలు ఇచ్చినా సరైన రోడ్లు, తాగునీరు, కరెంట్, డ్రెయినేజీ వంటి కనీస వసతులు కల్పించలేదని పేర్కొన్నారు. పేద ప్రజల కనీస అవసరాలు తీర్చడంలో పాలకులకు చిత్తశుద్ధి లేదని తెలిపారు. ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన గృహాలు లబ్ధిదారులకు ఇవ్వడానికి ఇంత సమయం ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనకు దిగుతామని తెలిపారు.

పలు సొసైటీలకు ఛైర్మన్ల నియామకం



కొండబాబును అభినందిస్తున్న గన్ని వీరాంజనేయులు

గుండుగొలను సొసైటీ ఛైర్‌పర్సన్‌గా కొండబాబు

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను విశాల సహకార పరపతి సంఘం ఛైర్‌పర్సన్‌గా గుండుగొలను గ్రామానికి చెందిన సిరిబత్తిన వీరవెంకటసత్యనారాయణ (కొండబాబు) నియమితులయ్యారు. టిడిపి సీనియర్ నాయకునిగా కొనసాగుతున్న కొండబాబు గతంలో ఉమ్మడి తెలుగు రాష్ట్రాల పరిధిలో ఉన్న అప్పటి భీమడోలు ఎంపిపిగా పనిచేశారు. పాలకమండలి త్రి సభ్య కమిటీ ఛైర్‌పర్సన్‌గా ఆయనతో పాటు పర్సన్లుగా భలే మురళీకృష్ణ, మామిళ్లపల్లి సాయికృష్ణ ఎంపికయ్యారు.

చింతలపూడి మండలంలో...


చింతలపూడి :చింతలపూడి సొసైటీ ఛైర్మన్‌గా తిరుమల్లి రామారావు, మెంబర్స్‌గా నందిపాము నాగేశ్వరరావు, చిక్కాల శ్రీనివాసరావు, రాఘవపురం సొసైటీ ఛైర్మన్‌గా మాట్టూరి వెంకట రామయ్య, పర్సన్లుగా తగరం పెద్ద రాములు, తాటిపర్తి చిన్ని సత్యనారాయణ, సీతానగరం సొసైటీ ఛైర్మన్‌గా ఆది ధర్మారావు, పర్సన్లుగా ఎం.వీరాస్వామి, పి.వినోద్‌కుమార్, యర్రంపల్లి సొసైటీ ఛైర్మన్‌గా తాళ్లూరి చంద్రశేఖర్‌రెడ్డి, పర్సన్లుగా బేతు నాగేశ్వరరావు, లక్కపం వెంకటేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు చింతలపూడి ఎంఎల్‌ఎకు కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకంతో బాధ్యతలు ఇచ్చినందుకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. సకాలంలో రైతులకు రుణాలు ఇచ్చి కూటమి ప్రభుత్వనికి మంచి పేరు తీసుకొస్తామని తెలిపారు.


దర్భగూడెం సొసైటీ అధ్యక్షుడిగా విజయ్‌ప్రసాద్

జీలుగుమిలి :మండలంలోని దర్భగూడెం సొసైటీ ఛైర్మన్‌గా అక్కిశెట్టి విజయ్‌ప్రసాద్, సభ్యులుగా కోనేటి హనుమంతరావు, సింగులూరి వెంకట రామారావులను నియమిస్తూ గుంటూరు కోఆపరేటివ్ కమిషనరేట్ నుంచి ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. కూటమి పొత్తులో భాగంగా ఇక్కడ సొసైటీ జనసేనకు కేటాయించడంతో వారిని నియమించినట్లు చెబుతున్నారు. ఈ మేరకు సొసైటీ ఛైర్‌పర్సన్, సభ్యులుగా ఎన్నికైన ముగ్గురికి పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజుతో పాటు పలువురు కూటమి నాయకులు అభినందనలు తెలిపారు. అయితే మండలంలోని జీలుగుమిల్లి, ములగలంపల్లి సొసైటీలకు సంబంధించి ఛైర్‌పర్సన్ల నియామకానికి సంబంధించి ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది.

ముసునూరు మండలంలో...

ముసునూరు :ముసునూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ ఛైర్‌పర్సన్‌గా దేవినేని శ్రీధర్, పర్సన్లుగా గోగం కాటమరాజు, చీలి లక్ష్మి, చెక్కపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ ఛైర్‌పర్సన్‌గా కాటేపల్లి వెంకటనార్యప్రసాద్, పర్సన్లుగా వేంపాటి శ్రీనివాసరావు, డి.నాగమణి, కొర్లకుంట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ ఛైర్‌పర్సన్‌గా పొట్లూరి అనురాధ, పర్సన్లుగా ఎన్.సూర్యనారాయణ, ఆలూరు సుమలత, చింతలపల్లి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ ఛైర్‌పర్సన్‌గా బర్మా రమేష్, పర్సన్లుగా జె.రంగారావు, పల్లి పాము పెంటమ్మ, రమణక్కపేట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ ఛైర్‌పర్సన్‌గా రంగు ఆంజనేయులు, పర్సన్లుగా పాశం వెంకటేశ్వరరావు, ముళ్లపూడి మల్లేశ్వరి నియమితులయ్యారు.


తిరుమల్లి రామారావు


వెంకట రామయ్య


ఆది ధర్మారావు



చంద్రశేఖర్



ఆంజనేయులు


విజయ్‌ప్రసాద్


అనురాధ


బర్మా రమేష్


దేవినేని శ్రీధర్


సూర్యప్రసాద్

కైండ్‌నెస్‌వాల్ ప్రారంభం

నూతన కార్యక్రమానికి ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ శ్రీకారం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఇంట్లో వాడకుండా ఉన్న బట్టలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బొమ్మలు ఓ పక్కన పడి ఉంటే వాటిని వేరే వారు వినియోగించుకుని అవకాశాన్ని, మీకు కావాల్సిన వస్తువులను ఉచితంగా తీసుకునే ప్రక్రియకు ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ ఆదివారం శ్రీకారం చుట్టారు. పోలీస్ పెట్రోల్ బంక్‌లో కైండ్‌నెస్ వాల్ పేరుతో ఒక ప్రత్యేక అల్మరాను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ అల్మారా ప్రత్యేకత ఏమిటంటే ఉపయోగం లేని, వినియోగంలో లేని వస్తువులు, బట్టలు, బొమ్మలు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఇతర ఏ వస్తువులు అయినా అల్మారాలో పెట్టవచ్చని, అయితే అప్పటికే ఈ అల్మారాలో ఏవైనా వస్తువులు పెట్టి ఉంటే అవి అవసరమైతే వాటిని ఉచితంగా తీసుకెళ్లి వినియోగించుకోవచ్చు. ఇది ఈ కైండ్‌నెస్‌వాల్ ప్రత్యేకత. ఇప్పటివరకు ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి సంయుక్తంగా టేక్ ఎ బుక్ గివ్ ఎ బుక్ పేరుతో పుస్తకాల మార్పిడి విధానానికి శ్రీకారం చుట్టారు. కొత్తగా ఇలా బట్టలు, బొమ్మలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, మార్పిడి విధానానికి శ్రీకారం చుట్టారు. ఎప్పుడో తాతల, తండ్రుల కాలంలో ఈ వస్తువు మార్పిడి విధానం కొనసాగేది. ప్రస్తుతం ఈ ప్రక్రియకు ప్రజల నుంచి మిశ్రమ స్పందన లభిస్తుంది. కొందరు బాలలు ఈ అల్మారాలో ఉన్న బట్టలను ఉచితంగా తీసుకెళ్తూ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. వారు ఎస్‌పికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.



పెదలంక డ్రెయిన్‌లో పూడిక తీత పనులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

సాగునీరు ఇబ్బందులను అధిగమించేందుకు పెదలంక డ్రెయిన్‌లో పూడిక తీత పనులు నిర్వహిస్తున్నామని పెద గొన్నూరు డిసి ఛైర్మన్ గుడిసేవ సురేష్ ఆదివారం తెలిపారు. కైకలూరు ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా పెదలంక డ్రెయిన్‌లో దేవపూడి వంతెన వద్ద నుంచి మురుగు కాలువలో పూడికతీత పనులను డిసి ఛైర్మన్ గుడిసేవ సురేష్ పర్యవేక్షించి పరిశీలించారు. గత కొన్నేళ్లుగా పెదలంక డ్రెయిన్‌లో పూడిక తీత పనులు చేపట్టకపోవడంతో కింద ఉన్న పంట పొలాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మురుగు కాలువలో పూడిక, గుర్రపు డెక్క, చెత్త చెదారంతోపాటు కాలువ గట్టు పైన చాలాచోట్ల చెట్లు ఏపుగా పెరిగాయన్నారు. వీటిని పూర్తిగా తొలగిస్తున్నట్లు చెప్పారు. ఈ పూడిక తీత పనుల వల్ల వరి పొలాలు ముంపు బారిన పడకుండా ఉంటాయని సురేష్ అన్నారు. పెదలంక డ్రెయిన్‌లో గుర్రపు డెక్క, పూడిక తీత పనులు చేపట్టడంతో డ్రెయిన్ ఆయుకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పనులు పరిశీలిస్తున్న డిసి ఛైర్మన్ సురేష్

ఉపాధ్యాయ హక్కుల కోసం రాజీలేని పోరాటాలు

ఘనంగా యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు


ఏలూరులో....

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) పోరాట యోధుల త్యాగాల బాటలో, అలుపెరుగని పోరాటాలతో 52 వసంతాలు పూర్తి చేసుకుందని ఆ సంఘం జిల్లా కోశాధికారి రంగమోహన్ అన్నారు. యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయ ఆవరణలో సంఘ పతాకాన్ని సీనియర్ నాయకులు తేరా ప్రసాద్ ఆవిష్కరించారు. యుటిఎఫ్ గేయాలను ఉపాధ్యాయ కళాకారులు ఆలపించారు. ఈ సందర్భంగా రంగమోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ హక్కులు కాపాడటంలో రాజీలేని పోరాటాలు నిర్వహించిన చరిత్ర కలిగిన సంఘంగా యుటిఎఫ్ ఉందన్నారు. ఉపాధ్యాయ హక్కులు కాపాడటంతో పాటు విద్యార్థుల బంగారు భవిష్యత్తు కోసం ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పాటు పడుతుందన్నారు. ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల్లో పోరాటాల్లో రాటుతేలిన ఉద్యమ అభ్యర్థులను నిలబెట్టి, అధికార ప్రతిపక్ష పార్టీలను కాదని, ఉద్యమ అభ్యర్థులను గెలిపించిన వీరోచిత ఉద్యమ వారసత్వం యుటిఎఫ్‌కు ఉందన్నారు. నీతి నిజాయితీలతో ఉపాధ్యాయులకు జవాబుదారీగా పనిచేయడం వల్లే ఐదు దశాబ్దాల ఉద్యమ పయనం సాధ్యమైందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ హక్కుల కోసం రానున్న కాలంలో పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. సంఘం జిల్లా సహాధ్యక్షులు సుధారాణి మాట్లాడుతూ పటిష్టమైన ఉద్యమ నిర్మాణం చేసిన మహనీయుల ఆశయాలను సాధించేందుకు ఉపాధ్యాయులు పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బంటు మోహన్, జిల్లా కార్యదర్శులు కమల్‌కుమార్, అంజనాదేవి, జిల్లా కౌన్సిలర్లు కెవి.అప్పారావు, మరీదు లక్ష్మణ్, జిల్లా మీడియా కన్వీనర్ ఎండి.జిక్రియా, జిల్లా, మండలాల నాయుకులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : యుటిఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నారాయణపురం జెడ్‌పి హైస్కూల్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణకు, ఉపాధ్యాయుల సంక్షేమానికి గత 51 యుటిఎఫ్ ప్రస్థానంలో అవిశ్రాంత పోరాటాలు చేసి అసాధారణ విజయాలను సాధించారు. ఆవిర్భావం నుంచి నేటి వరకు క్రమశిక్షణకు మారుపేరుగా, అవినీతిపై రాజీ లేని వైఖరితో సమస్యల సాధనలో పోరాట మార్గంలో పయనిస్తున్నారు. యుటిఎఫ్ సభ్యులకు, కార్యకర్తలకు, నాయకత్వానికి ఉద్యమ జేజేలు తెలియజేస్తూ యుటిఎఫ్ ఉంగుటూరు సీనియర్ నాయకులు ఉప్పిలి వెంకటేశ్వరరావుచే పతాకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పునుమూలు రాంబాబు, ప్రధాన కార్యదర్శి డాకిజోగినాయుడు, ఊట ఆనందకుమార్, పచ్చమట్ల రవీంద్రవర్మ, నారాయణపురం క్లస్టర్ ఛైర్మన్ తోట పోతురాజు, ఆడిట్ కన్వీనర్ టి.శ్రీధర్, సీనియర్ నాయకులు బాలకృష్ణ, హరికృష్ణ, లక్ష్మీనారాయణ, ఉపేంద్ర, నాగేశ్వరరావు, చదలవాడ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.


ఉంగుటూరులో....

భద్రాచలం-కొవ్వూరు రైల్వేలైన్ డిపిఆర్ సిద్ధం

త్వరలో పనులు ప్రారంభం

ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి ఏలూరు సిటీ

భద్రాచలం - కొవ్వూరు రైల్వే లైన్ డిపిఆర్ సిద్ధమైందని, త్వరలోనే పనులు మొదలవ్వబోతున్నాయని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రైల్వే లైన్ కోసం గత పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లోనే పార్లమెంట్ సాక్షిగా కేంద్ర రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లి, ప్రాజెక్టు పూర్తి చేసేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఏలూరు లోక్‌సభ పరిధిలోని చింతలపూడి, పోలవరం అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు, పాత ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గోపాలపురం, కొవ్వూరు నియోజకవర్గాల ప్రజలు కూడా ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న భద్రాచలం-కొవ్వూరు రైల్వే లైన్ పనులను ఇప్పటికైనా మొదలు కాబోతుండటం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి మీదుగా కొవ్వూరు వరకూ 118.9 కిలోమీటర్ల మేర నిర్మించాల్సిన రైల్వే లైన్‌కు దాదాపు రూ.1,695.71 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేయగా, ఈ ఖర్చును పూర్తిగా రైల్వే శాఖ భరించాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున కోరినట్లు తెలిపారు. దీంతో విశాఖపట్నం - హైదరాబాద్ మధ్య 100కు పైగా కిలోమీటర్ల దూరం తగ్గుతుందని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉండిపోయిన ఈ ప్రాజెక్టు కోసం ఏడాదికాలంగా తన వంతు కృషి చేశానని తెలిపారు. రైల్వే అధికారులు పంపిన డిపిఆర్‌ను ఆమోదించి, పనులు త్వరగా మొదలు పెడతారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ట్రాలీ లారీ బోల్తా

డ్రైవర్‌కు, క్లీనర్‌కు గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్



బోల్తా పడిన లారీ

కూల్ డ్రింక్ బాటిల్స్ లోడుతో వెళ్తున్న ట్రాలీ లారీ అదుపుతప్పి డివైడర్ ఎక్కి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన కలపర్రు సమీపంలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. హైవే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయవాడ నుంచి మింట్ మెయిడ్ పల్ప్ ఆరంజ్ కూల్ డ్రింక్ బాటిల్ లోడుతో ట్రాలీ లారీ విశాఖపట్నం బయలుదేరింది. లారీ కలపర్రు-కొక్కిరిపాడు వంతెన సమీపానికి చేరుకునేసరికి ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్ ఎక్కి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. లారీ బోల్తా పడిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. క్లీనర్‌కు 108 సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. హైవే పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తున్నారు.

అన్నదమ్ముల మధ్య విభేదాలు తలెత్తి...

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అన్నదమ్ముల మధ్య విభేదాల నేపథ్యంలో పాయిజన్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. వివరాల ప్రకారం... పెరవలి మండలం ఉసురుమర్రుపాలెం గ్రామానికి చెందిన తానేటి శ్రీనివాస్ (42) స్థానికంగా వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. ఈ క్రమంలో అన్నదమ్ముల మధ్య చిన్నపాటి విభేదాలు తలెత్తడంతో శ్రీనివాస్ పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని స్థానిక ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు.

అనారోగ్య కారణాలతో...

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అనారోగ్య కారణాలతో మనస్తాపానికి గురైన వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సంబంధిత వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ మండలం రంగారావు కాలనీకి చెందిన పిల్ల తాతారావు (67) స్థానికంగా కుటుంబ సభ్యులతో కలిసి జీవిస్తున్నాడు. ఆయన గత రెండేళ్లుగా పలు రకాలైన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యంతో వచ్చే బాధలు తాళలేక శనివారం ఎలకల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు అయనను ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పేకాట స్థావరంపై దాడి చేసిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కనకాపురం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు ఆదివారం సాయంత్రం దాడి చేశారు. ఈ దాడిలో పలువురు పారిపోగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.మూడు వేల నగదు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పెదవేగిలో...

ఏలూరు స్పోర్ట్స్ : గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన పెదవేగి మండలం ఏడో మైలు వద్ద ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. పెదవేగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఏడో మైలు గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్నరన్న సమాచారం మేరకు పెదవేగి పోలీసులు ఆ ప్రాంతంలో ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.8,100 నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాట రాయుళ్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ దాడిలో పెదవేగి ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కోడి వ్యర్థాలు తరలిస్తున్న వాహనం పట్టివేత

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

చికెన్ వ్యర్థాలను తరలిస్తున్న అశోక లేలాండ్ దోస్త్ వాహనాన్ని ఏలూరు హైవే సేఫ్టీ సిబ్బంది గుర్తించి పెదపాడు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటన ఆదివారం పెదపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం కలర్రు టోల్ ప్లాజా వద్ద మొబైల్ సేఫ్టీ సిబ్బంది హైవే పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ఏలూరు వైపు నుంచి వస్తున్న అశోక్ లేలాండ్ దోస్త్ వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. ఆ వాహనంలో చికెన్ వ్యర్థాలు తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని పెదపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పెదపాడు పోలీసులు వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు.

కోడి పందేల స్థావరంపై దాడి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కోడిపందేల స్థావరంపై దాడి చేసిన పోలీసులు ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి కోళ్లు, నగదు స్వాధీనం చేసుకున్నారు. నూజివీడు సిఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రావిచెర్ల గ్రామంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు రూరల్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ దాడిలో కోడిపందేలు ఆడుతున్న ఏగుడురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రెండు కోళ్లు, రూ.24 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు.

ఆదిత్య కళాశాల ఆధ్వర్యాన స్వచ్ఛభారత్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరులోని ఆదిత్య డిగ్రీ కాలేజీ ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో వాలంటీర్లు ఏలూరు కొత్త బస్టాండ్ ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వంగా వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వంగ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావం, సమాజం పట్ల అవగాహన, జాతీయభావం కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు మంచి మార్గంలో నడిపించడం అనే విషయాలే లక్ష్యంగా సెలవు దినమైన ప్రతి ఆదివారం ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఫణికుమార్, ఎఒ సిహెచ్.కృష్ణ, ఎన్ఎస్ఎస్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ వై.గణేష్, ఎం.రోహిత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బుక్‌లెట్ రూపంలో పరీక్షలు

ప్రజాశక్తి - ముసునూరు

నేటి నుంచి అసైన్‌మెంట్ పరీక్షలు బుక్‌లెట్ రూపంలో రాయాల్సి ఉంటుందని రమణక్కపేట జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం పివిఎస్.రామకృష్ణ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రశ్నాపత్రాలపై, వైట్ పేపర్లపై రాసే విధానానికి స్వస్తి పలికి, నూతనంగా ఎఫ్ఎ వన్ పరీక్షల విధానంలో సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు 72 పేజీల పుస్తక రూపంలో ఉన్న బుక్‌లెట్ అందించనున్నట్లు తెలిపారు. ఆరు పరీక్షల్లో ఈ పుస్తకం రూపంలోనే పరీక్షా విధానాలు ఉంటాయని తెలిపారు. గణితం పరీక్షలో గ్రాఫ్స్, సోషల్ పరీక్షలో మ్యాప్, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయని, అదే విధంగా ఒఎంఆర్ షీట్ వలె ప్రశ్నాపత్రం ఉంటుందని తెలిపారు.

విద్యార్థి మృతదేహం పోస్టుమార్టానికి తరలింపు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలో శనివారం రాత్రి విద్యుధాఘాతానికి గురై మృతి చెందిన విద్యార్థి ఎం.ఏసురాజు మృతదేహాన్ని ఆదివారం పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ విఎస్.వీరభద్రుడు కేసు నమోదు చేసి ప్రమాదం జరిగిన సంఘటన స్థలాన్ని ఆదివారం ఉదయం పరిశీలించారు. అనంతరం విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. సాయంత్రం ఏసురాజు అంత్యక్రియలు నిర్వహించారు. విద్యార్థి మృతదేహాన్ని ఎపి టూరిజం డెవలప్‌మెంట్ డైరెక్టర్ కొడాలి వినోద్ సందర్శించి అంజలి ఘటించారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని తెల్లంవారిగూడెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల (బాలికలు)లో ఆదివారం హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. కెఆర్‌పురం ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్ హాజరయ్యారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. పాఠశాల విద్యార్థినులు వేసిన ముగ్గులను రాములునాయక్ పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిడి, ట్రైబల్ వెల్ఫేర్ ఎన్.శ్రీవిద్య, ఇఇ, ట్రైబల్ వెల్ఫేర్ టి.లత, బుట్టాయగూడెం ఎటిడబ్ల్యుఒ జె.జనార్దన్, ఐటిడిఎ ఎఎంఒ కె.సిరమయ్య, పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థునులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర

ముసునూరు : మండల కేంద్రమైన ముసునూరులో ఆదివారం ఉదయం గంగానమ్మ జాతర వేడుకలు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కమిటీ వారి ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటో సాంబ య్య, చెన్ను నాగేశు, చెన్ను సత్యం, ఏడుకొండలు, చింతా రాఘవులు, కంచర్ల దుర్గారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జోరుగా మట్టి అక్రమ తవ్వకాలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల


మట్టిని తవ్వి ట్రాక్టర్ లోడ్ చేస్తున్న జెసిబి

ద్వారకాతిరుమల మండలంలో మట్టి మాఫియా అడ్డూఅదుపూ లేకుండా కార్యకలాపాలు సాగిస్తోంది. మట్టి అక్రమ తవ్వకాలతో రూ.లక్షల్లో దండుకుంటున్నారు. ప్రభుత్వానికి వరుసగా సెలవులు వస్తే అక్రమ మట్టి తవ్వకందారులకు ఒక పండగలా మారిపోతుంది. ద్వారకాతిరుమల మండలం పి.కన్నాపురం గ్రామ పంచాయతీ ఇల్లిందాలకుంట చెరువు నుంచి మట్టిని అక్రమార్కులు అనుమతులు లేకుండా తవ్వేసి ట్రాక్టర్లలో తరలించి అమ్ముకుంటున్నారు. వరుసగా మూడు రోజులు ప్రభుత్వ సెలవులు కావడంతో ఇదే అదునుగా భావించిన అక్రమారులు మట్టిని అక్రమంగా తవ్వేస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ ఒక ట్రిప్పునకు రూ.700 వరకు విక్రయిస్తున్నారు.

యాత్రికుల కోసం ప్రత్యేక బస్సులు

ప్రజా రవాణా శాఖాధికారి ఎస్‌కె.షబ్నం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిర్వహిస్తున్న టెంపుల్ టూరిజంలో భాగంగా ఆదివారం ఏలూరు డిపో నుంచి మూడు సూపర్ లగ్జరీ బస్సుల్లో ఏలూరులోని అంబికా దర్బార్‌బత్తి సంస్థ కార్మికులు దేవాలయాల యాత్రకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఏలూరు ప్రజా రవాణా శాఖాధికారి ఎస్‌కె.షబ్నం మాట్లాడుతూ టెంపుల్ టూరిజంలో భాగంగా ప్రజలకు ఆయా మాసాల విశిష్టతను బట్టి బస్సులు నడుపుతున్నామని, శ్రావణమాసంలో ప్రతి ఆదివారం దేవాలయాల సందర్శనకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, దీనిని చాలామంది ఆదరిస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా అంబికా సంస్థ వారు ముందుకొచ్చి వారి కార్మికులకు శ్రావణ మాస మహాలక్ష్మి స్పెషల్ ఆధ్యాత్మిక యాత్రను ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని, 17వ తేదీ కూడా ఆఖరి శ్రావణ ఆదివారం కావడంతో ఇంకా ఎవరైనా ముందుకు వస్తే వారికి కూడా బస్సు ఏర్పాటు చేస్తామని, రేపటి నుంచి రిజర్వేషన్ సౌకర్యం కూడా ఆన్‌లైన్ ఉంచుతామని తెలిపారు. శబరిమల అయ్యప్ప స్వామి యాత్రకు బస్సులు బుక్ చేసుకునే గురు స్వాములు ఇప్పటినుంచే బుక్ చేసుకోవచ్చని, గురుస్వాములకు అనుగుణంగా యాత్ర చేపడుతుందని దానికి సంబంధించి 9346767670, 6303859484 నంబర్లను సంప్రదించవచ్చని తెలియజేశారు.

ప్రయివేట్ ల్యాబ్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా లవకుమార్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణానికి చెందిన రమా డయాగ్నస్టిక్స్, డిజిటల్ ఎక్స్‌రే, రమా మెడికల్స్ అధినేత కంచర్ల లవకుమార్ ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ ల్యాబ్ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. నూజివీడు పట్టణానికి చెందిన లవకుమార్ రాష్ట్రస్థాయి జనరల్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల పలువురు ప్రముఖులు, సామాజికవేత్తలు ఆదివారం అభినందనలు తెలిపారు. లవకుమార్ ఐదేళ్లమున్సిపల్ వార్డు కౌన్సిలర్‌గా సేవలందించారు.

రైతు సంఘం మండల కమిటీ ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా జానకి రామిరెడ్డి, సీతారామయ్య

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రైతు సంఘం జీలుగుమిల్లి మండలాధ్యక్షుడిగా దాసరి జానకి రామిరెడ్డి, కార్యదర్శిగా సిరిబత్తుల సీతారామయ్య ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక సుందరయ్య కాలనీలో రైతు సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ మేరకు నిర్వహించిన ఎన్నికల్లో ఉపాధ్యక్షులుగా బిక్కిన వీర సత్యం, సుంకవల్లి శేషగిరిరావులను ఎన్నుకున్నట్లు శ్రీనివాస్ తెలిపారు. మొత్తం 12 మందిని నూతన మండల కమిటీగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని రైతు సమస్యలపై గట్టి పోరాటం చేస్తామన్నారు.

రాజుపోతేపల్లిలో 'సుపరిపాలనలో తొలిఅడుగు'

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని రాజుపోతేపల్లి గ్రామం బిసి కాలనీలో టిడిపి సీనియర్ నాయకులు క్లస్టర్ ఇన్‌ఛార్జి దావులూరి సూర్యనారాయణ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అందుగుల గాంధీ, నత్తా నాగరాజు, కలసాని రాము, చిలకా సుబ్బు, అందుగుల వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు దాసరి నాగభూషణరావు

సిపిఐ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు

నూజివీడు - టౌన్

రాజకీయ నాయకులకు, యువకులకు మాజీ ఎంపీ దాసరి నాగభూషణరావు ఆదర్శప్రాయులని సిపిఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు అన్నారు. దాసరి నాగభూషణరావు శతజయంతి కార్యక్రమం స్థానిక అమీర్‌భవన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు మాట్లాడుతూ దాసరి రాజకీయ జీవితం తొలి దశ విద్యార్థి పోరాటాలతోనే ప్రారంభమైందన్నారు. రాష్ట్ర వ్యాప్త డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. బందరులో విద్యార్థి పోరాటాలు, గుంటూరు ఎసి కాలేజీలో 41 రోజుల చారిత్రక సమ్మె విజయవంతం చేయడంలోనూ ముందుండి నాయకత్వం వహించారన్నారు. జమీందారీ భూస్వామ్య వ్యతిరేక పోరాటాలతో 45 గ్రామాల్లో సుమారు 30 వేల ఎకరాల భూమిని పంపిణీ చేసినట్లు తెలిపారు. భూస్వాములకు, జమీందారులకు వ్యతిరేకంగా ఎన్నో బలమైన ఉద్యమాలు నడిపారన్నారు. నూజివీడు నియోజకవర్గంలో స్కూళ్ల నిర్మాణానికి, సామాజిక భవనాలకు, సీసీ రోడ్లకు, ఇతర నిర్మాణాలకు ప్రతి రూపాయి ఖర్చు పెట్టారన్నారు. ఈ కార్యక్రమలో నియోజకవర్గ కార్యదర్శి ఎన్.నరసింహ, సిపిఐ టౌన్ సెక్రటరీ సిహెచ్.పుల్లారావు, భరతనాట్యం మాస్టారు వెంపటి మోహన్, ప్రజా సంఘాల నాయకులు కృష్ణప్రసాద్, కె.కృష్ణ, కె.రామ్మూర్తి, వాకా రాంబాబు, టి.వెంకట్రావు, ఎం.రాంబాబు, పి.ప్రవీణ్, ముత్యాల విజయ్, చలసాని వీరభద్రరావు, ఒగ్గు ముఖర్జీ, శేషయ్య మాస్టారు పాల్గొన్నారు.

సిపిఐ నేత బాబుకు పితృవియోగం

ప్రజాశక్తి - చింతలపూడి

సిపిఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు తండ్రి తొర్లపాటి నాగభూషణం (65) ఆదివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని సిపిఐ, సిపిఎం, టిడిపి, వైసిపి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు సందర్శించి పుష్పగుచ్ఛాలతో నివాళు లర్పించారు. నివాళులర్పించినవారిలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, సీనియర్ నాయకులు మామిళ్లపల్లి వసంతరావు, కంచర్ల గురవయ్య, దంతా కృష్ణ, టివిఎస్.రాజు, పుల్లూరి సోమశేఖర్, బోడా వజ్రం, గంధం అంజమ్మ, సిపిఎం నాయకులు ఆర్‌విఎస్.సత్యనారాయణ, ఎస్.సూర్యకుమార్, సిఐటియు నాయకులు నత్త వెంకటేశ్వరావు, టిడిపి పట్టణ అధ్యక్షులు తాటి అప్పారావు, కర్లపూడి రాజరత్నం, కంభం రమేష్, కొత్తపూడి శేషగిరి, మన్యం సత్తిబాబు, వైసిపి పట్టణ ఉపాధ్యక్షులు దారా పేర్రాజు నిమ్మగడ్డ దుర్గారావు, శానంపూడి కాంతారావు, జనసేన నాయకులు ఆర్నేపల్లి అప్పారావు, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు కె.చిన్నారావు, బంధువులు, స్నేహితులు, పాత చింతలపూడి గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీల్లో పేరుకుపోయిన తుక్కు

రోడ్లపై నీరు నిలిచి ప్రజల అవస్థలు

సమస్యను పరిష్కరించాలని వేడుకోలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మూడు రోజుల నుంచి ఏకధాటిగా కురిసిన వర్షానికి మండలంలోని గవరవరం పంచాయతీ పరిధిలోని గవరవరం, చొప్పరామన్నగూడెం గ్రామాల్లో డ్రెయినేజీలో మురుగునీరు రోడ్డుపైకి చేరుకుని దుర్గంధం వెదజల్లుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. వర్షం వచ్చినప్పుడల్లా ఇళ్లలోకి మురుగు నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీలో పేరుకుపోయిన తుక్కు, పంచాయతీ వారు ఎప్పటికప్పుడు తీయకపోవడంతో వర్షాకాలంలో నీరు ఇళ్లలోకి చేరుతుందని, ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇరు గ్రామల్లో డ్రెయినేజీ వ్యవస్థ నిర్వీర్యమవ్వడంతో పాఠశాలలకు వెళ్లే దారులు మురుగు నీరు, దుర్వాసనతో స్వాగతం పలుకుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఇరు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


గవరవరంలో రోడ్డుపైకి చేరుతున్న మురుగునీరు